

రన్నింగ్ స్టాఫ్ సమస్యలు పరిష్కరించాలి - 8లో▸

రైల్వేలో రన్నింగ్ స్టాఫ్ సమస్యలు పరిష్కరించాలని ఏఐఎల్ఆర్ఎస్ఏ సెంట్రల్ కమిటీ వైస్ ప్రెసిడెంట్ హనుమయ్య డిమాండ్ చేశారు.



పవర్‌ఫుల్!

ఈ వేసవిలో విద్యుత్ వినియోగం భారీగా పెరగనుందనే ఆలోచనతో టీజీ ఎన్పీడీసీఎల్ ప్రత్యేకంగా వేసవి ప్రణాళిక రూపొందించింది. - 8లో▸

గరిష్టం/కనిష్టం
36.5^0 /17.0^0

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండతో పాటు ఉక్కపోతగా ఉంటుంది. రాత్రివేళ కాస్త చలి తీవ్రత ఉంటుంది.

న్యూస్‌రీల్

ఎన్నికల విధులనుంచి మినహాయింపు ఇవ్వాలి



మహబూబాబాద్: రిటైర్మెంట్‌కు దగ్గరలో ఉన్న ఉద్యోగులను ఎన్నికల విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బలాష్టి రమేశ్ అన్నారు. టీపీటీఎఫ్ జిల్లాశాఖ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టర్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ వీరబ్రహ్మచారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించనున్న నేపథ్యంలో ఆరు నెలలలోపు ఉద్యోగ విరమణ పొందనున్న ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఎన్నికల విధులు కేటాయించొద్దన్నారు. కార్యక్రమంలో చుంచు శ్రీశైలం, ఉపేందర్, రామలింగారెడ్డి, రమేశ్, శివకుమార్, బాలాజీ, శ్రీనివాస్, ప్రకాశ్, రవి, మధుసూదన్‌రావు, నరేశ్, ఉస్మాన్, నాగేశ్వర్‌రావు, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు ఉపాధ్యాయులకు మెమోలు

నర్సింహులపేట: మండలంలోని వశ్రాంతండా ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్న ఇద్దరు ఉపాధ్యాయులు సమయపాలన పాటించకపోవడంతో డీఈఓ ఆదేశాల మేరకు మెమోలు జారీ చేయడంతో పాటు ఒకరోజు వేతనం కట్ చేసినట్లు ఎంఈఓ రామ్మోహన్‌రావు తెలిపారు. ఉపాధ్యాయులు పాఠశాలకు సక్రమంగా రావడం లేదనే సమాచారంతో బుధవారం తనిఖీ చేసినట్లు చెప్పారు. ఇద్దరు ఉపాధ్యాయులు గైర్హాజరుకావడంతో మెమోలు జారీ చేశామన్నారు. సమాచారం లేకుండా విధులకు గైర్హాజరైతే శాఖాపరమైన చర్యలు తప్పవని ఎంఈఓ హెచ్చరించారు.

డిజిటల్ బోర్డులపై బోధించాలి



మహబూబాబాద్ అర్బన్: ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులందరూ డిజిటల్ బోర్డులను వినియోగిస్తూ విద్యార్థులకు బోధించాలని డీఈఓ రవీందర్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని హోలీ ఏంజిల్స్ పాఠశాలలో బుధవారం పీఎం శ్రీ పాఠశాలల నిర్వహణపై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న ప్రతీ విద్యార్థికి అపార్ కార్డును అందజేయాలన్నారు. కార్యక్రమంలో ఏడీ రాజేశ్వరరావు, ఎఫ్ఏఓ మహంకాళి బుచ్చయ్య, ప్లానింగ్ కోఆర్డినేటర్ పూర్ణచందర్, క్వాలిటీ కోఆర్డినేటర్ చంద్రశేఖర్ ఆజాద్, ఏసీ సంతోష్, హెచ్ఎంలు, రిసోర్స్‌పర్సన్స్ పాల్గొన్నారు.

ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవు

- అదనపు కలెక్టర్ వీరబ్రహ్మచారి

మహబూబాబాద్: మీసేవ కేంద్రాలకు సంబంధించి ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవని అదనపు కలెక్టర్ వీరబ్రహ్మచారి హెచ్చరించారు. కలెక్టర్ కార్యాలయంలోని మినీ సమావేశం మందిరంలో బుధవారం మీసేవ కేంద్రాల నిర్వాహకుల(వీఎల్ఈ)తో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. నిబంధనలకు అనుగుణంగా కేంద్రాల పనితీరు ఉండాలన్నారు. మీసేవ కేంద్రాల నిర్వాహకులకు ప్రతీ నెల సమావేశం నిర్వహించాలన్నారు. మీసేవ టెక్నికల్ సమస్యలు, సర్వీసులపై సమస్యలు ఉంటే వెంటనే అధికారులకు తెలియజేయాలన్నారు. సమావేశంలో ఈ-డిస్ట్రిక్ట్ మేనేజర్ ప్రశాంత్, మీసేవ కేంద్రాల నిర్వాహకులు పాల్గొన్నారు.

ఉద్యాన కళాశాలకు స్థలం కేటాయించాలి

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మండలం మల్యాల గ్రామంలో ఏర్పాటు చేయనున్న ఉద్యాన కళాశాల కోసం రెవెన్యూ అధికారులు స్థలం కేటాయించాలని తెలంగాణ ఉద్యాన యూనివర్సిటీ రిజిస్ట్రార్ భగవాన్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. రాష్ట్ర ప్రభుత్వం మల్యాల గ్రామంలో ఉద్యాన కళాశాలను మంజూరు చేసిందని, ప్రస్తుతం ఉన్న జేవీఆర్ ఉద్యాన పరిశోధన స్థానంలో ఉద్యాన కళాశాల నిర్మాణం కోసం అవసరమైన 20 నుంచి 25 ఎకరాల ఖాళీ స్థలం లేదన్నారు. కేవలం 3 నుంచి 4 ఎకరాల మాత్రమే ఖాళీ స్థలం ఉందని, దానిని భవిష్యత్ పరిశోధనల కోసం తమ పరిధిలో ఉంచామని పేర్కొన్నారు. ప్రభుత్వం జారీ చేసిన జీఓ ప్రకారం మంజూరైన ఉద్యాన కళాశాలను మల్యాల గ్రామ రెవెన్యూ పరిధిలో ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వ ఆధీనంలో ఉన్న స్థలాన్ని కేటాయించాలని కోరారు. ఈ విషయంపై గతంలో కలెక్టరేట్‌లో వినతిపత్రం కూడా ఇచ్చామని పేర్కొన్నారు.

అప్‌గ్రేడ్ ఆలస్యం!

శంకుస్థాపనకే పరిమితమైన సీహెచ్‌సీలు

- ఏడాదిగా వెక్కిరిస్తున్న శిలాఫలకాలు
- టెండర్ పూర్తయినా ప్రారంభంకాని పనులు
- పెద్ద ఆస్పత్రికోసం పేదల ఎదురుచూపు

సాక్షి, మహబూబాబాద్: పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలనే ఉద్దేశంతో గత సర్కారు ప్రభుత్వ ఆస్పత్రుల అప్‌గ్రేడ్, నూతన ఆస్పత్రుల నిర్మాణాలకు శ్రీకారం చుట్టింది. అయితే 16 నెలలు గడిచినా పనులు ముందుకు సాగడం లేదు. టెండర్లు పూర్తి చేసి కొన్ని పనులు ప్రారంభించగా.. మరికొన్ని స్థల సేకరణ ప్రక్రియతోనే నిలిచిపోయాయి. దీంతో ఆస్పత్రుల నిర్మాణాల కోసం వేసిన శిలాఫలకాలు వెక్కిరిస్తుండగా.. పేదలకు జబ్బు చేస్తే మెరుగైన వైద్యం అందని పరిస్థితి నెలకొంది.

వెక్కిరింత..

జిల్లాలో మానుకోట తర్వాత తొర్రూరు పట్టణం పెద్దది. మరిపెడ గిరిజనులు అధికంగా ఉన్న పట్టణం. ఆయా పట్టణాల్లోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలకు ప్రతీరోజు వందలాది మంది రోగులు వస్తుంటారు. స్థానిక అవసరాలను దృష్టిలో ఉంచుకుని గత ప్రభుత్వం ఈ రెండు ఆస్పత్రులను 100 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్లుగా అప్‌గ్రేడ్ చేసింది. ఒక్కో ఆస్పత్రి నిర్మాణానికి రూ.36కోట్ల చొప్పున నిధులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో 2023 సెప్టెంబర్ 28న అప్పటి వైద్యారోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు చేతుల మీదుగా ఆస్పత్రుల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. అదేవిధంగా జిల్లాలోని నర్సింహులపేట, పెద్దవంగర, సీరోలు మండలాల్లో నూతన ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు మంజూరు చేశారు. ఇందుకోసం ఒక్కో పీహెచ్‌సీకి రూ.1.43కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. ఇందులో సీరోలు మండలం కాంపెల్లి, నర్సింహులపేట మండలంలో పీహెచ్‌సీ నిర్మాణాల కోసం టెండర్ ప్రక్రియ కూడా పూర్తి చేశారు. కానీ పనులు ప్రారంభం కాలేదు. అదేవిధంగా పెద్దవంగర పీహెచ్‌సీ కోసం భూసేకరణ జరగలేదు. అదేవిధంగా ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం గత ఏడాది సెప్టెంబర్‌లో కేసముద్రం మున్సిపాలిటీ, కొత్తగూడ మండల కేంద్రంలో ఉన్న ఆస్పత్రులను 30 పడకలకు అప్‌గ్రేడ్ చేసింది. కొత్తగూడ ఆస్పత్రికి రూ.13.5కోట్లు, కేసముద్రానికి రూ. 12కోట్లు మంజూరు చేశారు. అయితే ఈ పనులు టెండర్ దశలోనే ఉన్నాయి.



మరిపెడలో సీహెచ్‌సీ నిర్మాణ శంకుస్థాన శిలాఫలకం (ఫైల్)

పూర్తి చేస్తే దగ్గరకానున్న వైద్యం

జిల్లాలో అధికంగా గిరిజనులు, ఆదివాసీలు ఉన్నారు. వారు వైద్యానికి దూర ప్రాంతాల్లోని ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లాల్సి వస్తోంది. దీంతో వారి సంపాదనలో ఎక్కువ శాతం వైద్యం కోసమే ఖర్చు చేస్తున్నారు. కొందరు అప్పుల పాలు కూడా అవుతున్నారు. తొర్రూరు, మరిపెడ ఆస్పతుల నిర్మాణాలను పూర్తి చేస్తే వేలాది మందికి మెరుగైన వైద్యం అందుతుంది. తొర్రూరు, మరిపెడ సీహెచ్‌సీల్లో జనరల్ ఫిజీషియన్లు, జనరల్ సర్జన్లు, ప్రత్యేక నిపుణులు, స్టాఫ్ నర్సులు, పేషెంట్ కేర్స్, శానిటేషన్ సిబ్బంది వస్తారు. దాదాపు ఒక్కో ఆస్పత్రికి 120 మంది మేరకు వైద్యులు, సిబ్బంది వస్తారు. 24 గంటల ప్రభుత్వ వైద్యం అందుబాటులో ఉంటుంది. చుట్టు పక్కల మండలాలతో పాటు పక్కన ఉన్న జిల్లాల ప్రజలకు మేలు జరుగుతుంది. అలాగే జిల్లా కేంద్రంలోని ప్రభుత్వం జనరల్ ఆస్పత్రితో పాటు గూడూరు, గార్ల సీహెచ్‌సీలు, 21 పీహెచ్‌సీల వైద్యం మెరుగుపర్చాల్సి ఉంటుంది.

మెరుగైన వైద్యం అందుబాటులోకి తేవాలి



పాత తాలూకాగా ఉన్న మరిపెడలో 10 పడకల ఆస్పత్రిని 100 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేసి 16 నెలల క్రితం శంకుస్థాపన చేశారు. కానీ ఇప్పటి వరకు భవనాలు నిర్మించలేదు. ఆస్పత్రి స్థాయి పెరగలేదు. గిరిజనులు ఎక్కువగా ఉన్న ప్రాంతం, జాతీయ రహదారిపై పట్టణం ఉంది. ఇక్కడ ఆస్పత్రి స్థాయి పెంచితే పేదలకు మెరుగైన వైద్యం అందుతుంది.

- ఎడెల్లి పరశురాములు, మరిపెడ

చిన్న సమస్య వచ్చినా ఇబ్బందే..



గతంలో మండల కేంద్రంలో కాకుండా దంతాలపల్లిలో ఆస్పత్రి నిర్మించారు. కొత్త మండలాలు ఏర్పడిన తర్వాత నర్సింహులపేటకు ఆస్పత్రి చేసినట్లు చెప్పారు. శంకుస్థాపన కూడా చేశారు. కానీ ఏడాది గడిచినా బిల్డింగ్ నిర్మించలేదు. ఆస్పత్రి త్వరగా నిర్మిస్తే పేదలు ప్రైవేట్ ఆస్పత్రికి పోయి డబ్బులు ఖర్చుపెట్టే ఇబ్బంది పోతుంది.

- భూక్య వోంజీ నాయక్, నర్సింహులపేట

ఆస్పత్రి స్థాయి పెరగలేదు



అనారోగ్య సమస్యలు వస్తే వరంగల్, మహబూబాబాద్ వెళ్లాల్సి వస్తుంది. తొర్రూరులో 100 పడకల ఆస్పత్రిని గత ప్రభుత్వం మంజూరు చేసింది. నేటికీ నిర్మాణం జరగలేదు. ఆస్పత్రి సేవలు అందుబాటులోకి రాలేదు. తొర్రూరు మీదుగా వరంగల్ ఖమ్మం జాతీయ రహదారి ఉండడంతో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. పెద్ద ఆసుపత్రికి వెళ్లే లోపే ప్రాణాలు కోల్పోతున్నారు. పెద్ద ఆస్పత్రి తొర్రూరులో ఉంటే ప్రాణాలు నిలిచే అవకాశం ఉంటుంది.

- యర్రం రాజు, కంటాయిపాలెం, తొర్రూరు

త్వరలో అందుబాటులోకి వస్తాయి



తొర్రూరు, మరిపెడ తోపాటు, కేసముద్రం, కొత్తగూడ ప్రాంతాల్లోని ఆస్పత్రుల అప్‌గ్రేడ్ త్వరలో జరుగుతుంది. ఇందుకు సంబంధించి ప్రభుత్వ పరంగా పేపర్ వర్క్ పూర్తి అయ్యింది. కొన్నింటికి భవనాల నిర్మాణం కోసం టెండర్ ప్రక్రియ కూడా పూర్తి అయ్యింది. భవనాల నిర్మాణం వేగవంతం చేసి ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు ప్రయత్నిస్తాం.

- భూక్య వెంకట్రాములు, డీసీహెచ్ఎస్, మహబూబాబాద్

మనసారా మొక్కులు

ఘనంగా మండమెలిగె.. అమ్మవార్లకు పూజలు



సమ్మక్క గద్దె వద్ద భక్తుల రద్దీ





సమ్మక్క గుడిలో గద్దెను అలికి ముగ్గులేస్తున్న ఆడపడుచులు, నీళ్లు, శాక ఆరబోస్తున్న పూజారులు

మినీ మేడారం జాతర షురూ అయ్యింది. మేడారం, కన్నెపల్లిలో బుధవారం మండమెలిగె పండుగ ఆదివాసీ సంస్కృతీ సంప్రదాయం ప్రకారం వైభవంగా జరిగింది. సమ్మక్క-సారలమ్మల పూజారులు అమ్మవార్ల ఆలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవార్లను దర్శించుకునేందుకు బుధవారం వేలాది మంది భక్తులు తరలివచ్చారు. ఉదయం నుంచే మొదలైన భక్తుల తాకిడి మధ్యాహ్నం వరకు కొనసాగింది. జంపన్నవాగు వద్ద షవర్ల కింద స్నానాలు ఆచరించి అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. - ఎస్ఎస్ తాడ్వాయి

- వివరాలు 8లో▸



పూజాసామగ్రితో రాత్రి సమ్మక్క గుడినుంచి గద్దెల వద్దకు బయలుదేరిన పూజారులు

వైభవంగా బొడ్రాయి వార్షికోత్సవం





పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మురళీనాయక్-ఉమ దంపతులు, గ్రామ దేవతకు జలాభిషేకం చేస్తున్న భక్తులు

- పూజలు చేసిన ఎమ్మెల్యే మురళీనాయక్-ఉమ దంపతులు
- బారులుదీరి మొక్కులు చెల్లించుకున్న భక్తులు

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ పట్టణంలో గ్రామ దేవత (బొడ్రాయి) ద్వితీయ వార్షికోత్సవం బుధవారం వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే భక్తులు గ్రామ దేవతను దర్శించుకుని మొక్కులు చెల్లించుకునేందుకు బారులుదీరారు. బ్రహ్మశ్రీ తాటిపాముల నరసింహమూర్తి పర్యవేక్షణలో అర్చక పురోహితులు గుడి రాధాకృష్ణమూర్తి, తాటిపాముల దుర్గాప్రసాద్, చిట్టా శ్రీకాంత్ శాస్త్రి, మారేపల్లి కౌశిక్ శర్మ వేదమంత్రోచ్ఛరణల నడుమ పూజా కార్యక్రమాలను నిర్వహించారు. గోపూజ, విఘ్నేశ్వర పూజ, స్థల శుద్ధి, స్వస్తివాచనం, రక్షా సూత్రధారణం, అంకురార్పణం, జలాభిషేకం, పంచామృత అభిషేకాలు, మంటప పూజలు, మూలమంత్ర జపాలు జరిపారు. గణేష, దుర్గ, శాంతి, పౌష్టిక, రుద్ర, మూలమంత్ర యజ్ఞాలు నిర్వహించి పూర్ణాహుతి జరిపి, బలి ప్రదానం, కుంభాభిషేకం, పంచబోనాల సమర్పణ, భక్తజనులకు ఆశీర్వచనం నిర్వహించారు. బొడ్రాయికి ముత్యాలమ్మ కుమ్మరి పూజారులు బొడ్డుపల్లి వంశీకుల తరఫున మహబూబాబాద్ అథ్లెటిక్ అసోసియేషన్ అధ్యక్షుడు బొడ్డుపల్లి ఉపేంద్రం కుటుంబ సభ్యులు తొలి బోనం సమర్పించారు.



బొడ్రాయి వద్ద భక్తుల రద్దీ

ఎమ్మెల్యే దంపతుల పూజలు..

బొడ్రాయి ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్-ఉమ దంపతులు ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. బొడ్రాయికి అభిషేకం చేసి మొక్కులు చెల్లించుకున్నారు. కాగా బొడ్రాయి వార్షికోత్సవం నేపథ్యంలో పట్టణంలోని పలు దేవాలయాల్లో మొక్కులు చెల్లించుకున్నారు. ముత్యాలమ్మ దేవాలయాల్లో జంతుబలి ఇచ్చి పూజలు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్ చందర్ రెడ్డి, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెన్నం శ్రీకాంత్ రెడ్డి, జెన్నారెడ్డి మురళీధర్ రెడ్డి, పాల్వాయి రామ్మోహన్ రెడ్డి, పర్కాల శ్రీనివాస్ రెడ్డి, ఎడ్ల రమేశ్, పిల్లి సుధాకర్, ఏఎంసీ వైస్ చైర్మన్ మదన్ గోపాల్ లోయ, విద్యుత్ డీఈ విజయ్, భక్తులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి

- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు




సమావేశంలో మాట్లాడుతున్న దయాకర్‌రావు

పెద్దవంగర: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థులే విజయం సాధించి సత్తా చాటాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో మండలంలోని పలు గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో సమావేశం చేపట్టారు. నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డితో కలిసి దయాకర్‌రావు మాట్లాడారు. కాంగ్రెస్ పాలనలో ప్రజలు నిరాశలో ఉన్నారన్నారు. మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చి ఇంకా అబద్ధాలతో కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. రాబోయే రోజులన్నీ బీఆర్ఎస్ పార్టీవే అని వివరించారు. పార్టీ కోసం పని చేసే ప్రతీ కార్యకర్తను కంటికి రెప్పలా కాపాడుకుంటానని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ సైనికుల్లా పని చేయాలని కోరారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఐలయ్య, ప్రధాన కార్యదర్శి శ్రీరాం సంజయ్ తదితరులు ఉన్నారు.

మళ్లీ కోతలు..!

ఉమ్మడి వరంగల్‌లో మళ్లీ పెరిగిన 'సిజేరియన్'లు

- ఆస్పత్రి ప్రసవమంటే ఆపరేషన్ తప్పనిసరి
- 67.59 శాతం ఆపరేషన్లే.. 32.41 శాతమే సాధారణం
- ప్రైవేట్ ఆస్పత్రుల్లో 46.13శాతం కోతలు.. సర్కారు దవాఖానాల్లో 53.87 శాతం..
- హనుమకొండ, వరంగల్ జిల్లాల్లో మరీ దారుణం
- మిగతా నాలుగు జిల్లాల్లోనూ ఇదే పరిస్థితి..



సాక్షిప్రతినిధి, వరంగల్ :

- హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముస్తఫాపూర్‌కు చెందిన ఓ మహిళ ప్రసవం కోసం హనుమకొండ నయీంనగర్ ప్రాంతంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేరింది. నెలనెల అదే ఆస్పత్రిలోనే చెక్ చేయించుకుంటున్నప్పటికీ జనవరి 29 డెలివరీ టైం ఇచ్చి 23న జాయిన్ చేసుకున్నారు. 'కడుపులో పిండం అడ్డం తిరిగింది.. సాధారణ ప్రసవం కష్టమే'నన్న డాక్టర్ సూచనతో ఆపరేషన్‌కు అంగీకరించడం అనివార్యంగా మారింది.
- వరంగల్ జిల్లా సంగెం మండలానికి చెందిన ఓ మహిళ (28)ను రెండో కాన్పు కోసం హనుమకొండ కాకాజీ కాలనీలోని ఆస్పత్రికి ఆమె కుటుంబసభ్యులు తీసుకు వెళ్లారు. ఆమెకు సాధారణ కానుపు కష్టమని డాక్టర్ సూచించగా.. మొదటి కాన్పు ప్రభుత్వ ఆస్పత్రిలో సాధారణమేనని చెప్పినా ఆమెకు సిజేరియన్ ద్వారా ప్రసవం చేసినట్లు చెప్పారు.

... ఇలా ఉమ్మడి వరంగల్‌లో కడుపు కోతలు మళ్లీ పెరుగుతున్నాయి. ప్రైవేటు ఆస్పత్రుల్లో నిర్వహించే ప్రతీ 100 డెలివరీల్లో 68 సిజేరియన్లే ఉంటున్నాయి. 32 శాతమే సాధారణ ప్రసవాలు కాగా.. ఆపరేషన్ ప్రసవాలు మొత్తంగా చూస్తే ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ఎక్కువగా అయ్యాయి.

67.59 శాతం అపరేషన్ ప్రసవాలే...

ఉమ్మడి వరంగల్‌లో 2024 జనవరి 1 నుంచి 2025 జనవరి 31 వరకు.. మొత్తం ప్రసవాలు 40,221 జరిగాయి. అందులో 13,036 సాధారణ ప్రసవాలు కాగా.. 27,185 మందికి ఆపరేషన్‌లు చేసి పురుడు పోశారు.

- హనుమకొండ, వరంగల్ జిల్లాల్లో ఏడాదిలో జరిగిన ప్రసవాల గణాంకాలను పరిశీలిస్తే ఆందోళన కలిగిస్తోంది. ఉమ్మడి వరంగల్ గణాంకాలు చూస్తే.. ఈ రెండు జిల్లాల్లోని ప్రైవేట్ ఆస్పత్రుల్లో అత్యధికంగా ఆపరేషన్ ప్రసవాలు జరగడమే ఇందుకు నిదర్శనం. జిల్లాలో మొత్తం ప్రసవాలు 11,369 జరిగితే, అందులో 2,942 (25.88 శాతం) మాత్రమే సాధారణ ప్రసవాలు కాగా, 8,427 (74.12) ప్రసవాలు ఆపరేషన్ ద్వారా చేశారు. 8,427లో ప్రభుత్వ ఆస్పత్రుల్లో 3,926 జరిగితే, ప్రైవేట్ ఆస్పత్రుల్లో 4.511 ప్రసవాలు ఆపరేషన్ చేశారు. అదే విధంగా వరంగల్ జిల్లాలో మొత్తం 8,343 ప్రసవాల్లో 2,301 (27.58 శాతం) సాధారణం కాగా, 6,042 (72.42 శాతం) ఆపరేషన్ ప్రసవాలు చేశారు. 6,042 ఆపరేషన్ ప్రసవాల్లో 2,929 ప్రభుత్వాస్పత్రుల్లో జరిగితే, 3,123 ప్రైవేట్ ఆస్పత్రుల్లో చేశారు.

మహబూబాబాద్‌లో మరీ దారుణం....

- మహబూబాబాద్ జిల్లాలో ఏడాదిలో 7,174 ప్రసవాలు జరిగితే.. అందులో 1,885 (26.27 శాతం) సాధారణ ప్రసవాలు కాగా, 5,289 (73.73 శాతం) కడుపు కోసి కాన్పు చేసినవే. ప్రభుత్వ ఆస్పత్రుల్లో జరిగిన 4,031 ప్రసవాల్లో 1,557 సాధారణం కాగా, 2,474 సిజేరియన్‌లు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో 3,153 ప్రసవాలకు 328 సాధారణం కాగా, 2,815 సి సెక్షన్ ద్వారా ప్రసవాలు జరిగాయి. జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో 4,539 ప్రసవాలకు 2,184 సాధారణం కాగా, 2,355 సిజేరియన్ చేశారు. అలాగే ములుగు జిల్లాలో 3,974 ప్రసవాలకు 1,772 సాధారణం, 2,202 ఆపరేషన్ ప్రసవాలు. అయితే ఇక్కడ ప్రభుత్వ ఆస్పత్రుల్లో సాధారణ ప్రసవాలు ఎక్కువగా జరిగాయి. 3,057లో 1,461 ఆపరేషన్‌లు కాగా, 1,596 సాధారణ ప్రసవాలు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో 917లకు 741 ఆపరేషన్‌లు కాగా, 176 సాధారణ ప్రసవాలుగా నమోదయ్యాయి.


ఉమ్మడి జిల్లాలో ప్రసవాల తీరు (2024 జనవరి 1 నుంచి 2025 జనవరి 31 వరకు)

మొత్తం ప్రసవాలు	: 40,221
సాధారణం	: 13,036
ఆపరేషన్	: 27,185
ప్రభుత్వ ఆస్పత్రుల్లో..	
సాధారణ	: 10,569
ఆపరేషన్	: 14,645
ప్రైవేట్ ఆస్పత్రుల్లో..	
సాధారణ	: 2,467
ఆపరేషన్	: 12,540

ప్రభుత్వాసుపత్రుల వైపే 'జనగామ'...

- జనగామ జిల్లాలో ఏడాదిలో 4,822 ప్రసవాలు జరిగితే.. అత్యధికంగా 4,412 మంది ప్రభుత్వాస్పత్రుల్లోనే పురుడు పోసుకున్నారు. మొత్తం 4,822 ప్రసవాల్లో 1,952 సాధారణం కాగా, 2,870 మందికి ఆపరేషన్ చేశారు. ప్రభుత్వాసుపత్రిలో పురుడు పోసుకున్న 4,412 మందిలో 1,862 ప్రసవాలు సాధారణం కాగా, 2,650 సిజేరియన్. అలాగే 310 మంది ప్రైవేట్ ఆస్పత్రుల్లో ప్రసవించగా, 90 మంది సాధారణం కాగా, 310 మందికి ఆపరేషన్లు అనివార్యంగా మారాయి.

సాధారణ ప్రసవాలకే ప్రాధాన్యం.. ఆ దిశగా ప్రయత్నాలు..



ప్రభుత్వ ఆస్పత్రులతోపాటు ప్రైవేట్ ఆస్పత్రుల్లో సాధారణ డెలివరీలు చేసేందుకు ప్రాధాన్యమిస్తున్నాం. సాధారణ ప్రసవాలు పెంచే విధంగా ప్రతీనెల ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రి డాక్టర్లతో సమీక్ష సమావేశాలు నిర్వహిస్తున్నాం. తప్పనిసరి పరిస్థితుల్లో ఆపరేషన్ ద్వారా కాన్పులు చేయాలని, అందుకు గల కారణాలను రికార్డుల్లో నమోదు చేయాలని, ఎప్పటికప్పుడు సంబంధిత వివరాలను తెప్పించుకుంటున్నాం. ఆశాలు, ఏఎన్ఎంల ద్వారా గర్భిణులకు అవగాహన కల్పిస్తూ ప్రభుత్వ ఆస్పత్రిలోనే డెలివరీలు చేసుకునే విధంగా అవగాహన పెంపొందిస్తున్నాం.

- డాక్టర్ మధుసూదన్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి, భూపాలపల్లి

క్లుప్తంగా

రన్నింగ్‌ స్టాఫ్‌ సమస్యలు పరిష్కరించాలి



ఎం.ఎన్‌.ప్రసాద్‌ చిత్రపటానికి పూలతో శ్రద్ధాంజలి ఘటిస్తున్న హనుమయ్య

కాజీపేట రూరల్‌: రైల్వేలో అతి ప్రధాన రన్నింగ్‌ స్టాఫ్‌ (లోకో పైలెట్లు, అసిస్టెంట్‌ లోకో పైలెట్లు, గార్డులు) సమస్యలు పరిష్కరించాలని ఆల్‌ ఇండియా లోకో రన్నింగ్‌ స్టాఫ్‌ అసోసియేషన్‌ (ఏఐఎల్‌ఆర్‌ఎస్‌ఏ) సెంట్రల్‌ కమిటీ వైస్‌ ప్రెసిడెంట్‌ టి.హనుమయ్య డిమాండ్‌ చేశారు. కాజీపేట రైల్వే కమ్యూనిటీ హాల్‌లో బుధవారం ఏఐఎల్‌ఆర్‌ఎస్‌ఏ డివిజనల్‌ స్పెషల్‌ కన్వెన్షన్‌ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన హనుమయ్య ముందుగా ఎం.ఎన్‌. ప్రసాద్‌ చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 7వ పే కమిషన్‌ సిఫార్సుల ప్రకారం రన్నింగ్‌ స్టాఫ్‌కు రన్నింగ్‌ అలవెన్స్‌ 25 శాతం పెంచాలని డిమాండ్‌ చేశారు. ఈస్ట్‌ కోస్ట్‌ రైల్వే జోనల్‌ ప్రెసిడెంట్‌ చౌబే, సెంట్రల్‌ కమిటీ జాయింట్‌ సెక్రటరీ ఆర్‌కె.రాణా, సౌత్‌ సెంట్రల్‌ రైల్వే సికింద్రాబాద్‌ జోనల్‌ సెక్రటరీ ఇరానీ పాషా, సికింద్రాబాద్‌ డివిజన్‌ అధ్యక్ష కార్యదర్శులు ఏవీఎస్‌ఎన్‌ ఎన్‌.మూర్తి, ఆర్‌.ఎస్‌.శ్రీజిత్‌ రన్నింగ్‌ స్టాఫ్‌ సమస్యలపై మాట్లాడారు. అంతకు ముందు డివిజనల్‌ సెక్రటరీ ఆర్‌ఎస్‌.శ్రీజిత్‌ ఎఐఎల్‌ఆర్‌ఎస్‌ఐ జెండాను ఎగురవేశారు. సమావేశంలో సికింద్రాబాద్‌ డివిజన్‌, కాజీపేట బ్రాంచ్‌కు చెందిన 150 మంది ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యుత్‌ షాక్‌తో ఒకరి మృతి

నర్సింహులపేట: మండలంలోని రామన్నగూడేనికి చెందిన దుండి ఉప్పలయ్య(45) చేపలు పట్టడానికి వెళ్లి విద్యుత్‌ షాక్‌కు గురై మృతి చెందినట్లు ఎస్సై మాలోతు సురేశ్‌ తెలిపారు. రామన్నగూడెం సమీపంలోని వెంకమ్మ చెరువు మత్తడి దగ్గరలోని గుంతలో బుధవారం కరెంట్‌తో చేపలు పట్టే క్రమంలో వైరు తెగి ఉండడాన్ని చూసుకోకపోవడంతో షాక్‌కు గురై మృతి చెందాడు. మృతుడి భార్య మంజుల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పవర్‌ఫుల్‌!



ఉమ్మడి జిల్లాలో పెరిగిన విద్యుత్‌ వినియోగం

- దంచి కొడుతున్న ఎండలు, వాతావరణంలో మార్పులే కారణం
- డిమాండ్‌ను ఎదుర్కొనేందుకు విద్యుత్‌ శాఖ ప్రత్యేక ప్రణాళిక
- ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంపు

హన్మకొండ: వాతావరణంలో మార్పులు కనిపిస్తున్నాయి. చలి పెట్టాల్సిన సమయంలో ఉక్కపోత మొదలైంది. ఉమ్మడి వరంగల్‌ జిల్లాలో ఎండలు దంచికొడుతున్నాయి. ఉదయం కొద్దిగా చల్లని వాతావరణం ఉండడంతో వేడి నీటి కోసం గీజర్లు వాడుతున్నారు. పగలు ఎండలు దంచికొడుతుండడంతో ఫ్యాన్లు, ఏసీల వాడకం పెరిగిపోయింది. మరో వైపు ముందుగా నాట్లు వేసిన వరి పంట పొట్ట దశకు రావడంతో నీటి కోసం భూగర్భ జలాల వినియోగం పెరిగింది. ఈక్రమంలో విద్యుత్‌ డిమాండ్‌ పెరిగింది.

మొత్తం సర్వీస్‌లు ఎన్నంటే..

ఉమ్మడి వరంగల్‌ జిల్లాలోని 5 సర్కిళ్ల పరిధిలో 18,36,370 విద్యుత్‌ సర్వీస్‌లున్నాయి. ఇందులో గృహ వినియోగదారులు 12,50,009, కమర్షియల్‌ 152148, పరిశ్రమలు 8,925, కుటీర పరిశ్రమలు 2,092, వ్యవసాయ 3,92,879, వీధి దీపాలు 21,280, ఇతర సర్వీస్‌లు 9,037 ఉన్నాయి. హనుమకొండ సర్కిల్‌లో అన్ని సర్వీస్‌లు కలిపి 4,84,208 ఉన్నాయి. వరంగల్‌లో 4,19,318, జనగామలో 2,92,650, భూపాలపల్లి 3,00,346, మహబూబాబాద్‌ సర్కిల్‌లో అన్ని సర్వీస్‌లు కలిపి 3,39,848 ఉన్నాయి.

ప్రత్యేక ప్రణాళిక..

వాతావరణ పరిస్థితులను ముందుగానే అంచనా వేసిన టీజీ ఎన్పీడీసీఎల్‌ యాజమాన్యం ఈసారి వేసవిపై ప్రత్యేక దృష్టి సారించింది. ఈవేసవిలో విద్యుత్‌ డిమాండ్‌, వినియోగం భారీగా పెరగనుందనే ఆలోచనతో ప్రత్యేకంగా వేసవి ప్రణాళిక రూపొందించారు. ఫిబ్రవరి చివరి నాటికి వేసవి ప్రణాళికను పూర్తిగా కార్యరూపంలోకి తీసుకొచ్చేలా చర్యలు తీసుకున్నారు. ఈమేరకు డిమాండ్‌ను బట్టి 33/11 కేవీ సబ్‌ స్టేషన్లలో అధిక సామర్థ్యం కలిగిన పవర్‌ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసి సబ్‌ స్టేషన్‌ సామర్థ్యాన్ని పెంచారు. అధిక భారం ఉన్న డిస్ట్రిబ్యూషన్‌ ట్రాన్స్‌ఫార్మర్ల స్థానంలో అధిక సామర్థ్యం ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లను అమర్చడంతో పాటు అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు. అధిక భారం ఉన్న ఫీడర్లను గుర్తించి లోడ్‌ బదలాయింపు చేస్తున్నారు. విద్యుత్‌ అంతరాయాలను నివారించేందుకు సబ్‌ స్టేషన్లను అనుసంధానిస్తూ ప్రత్యామ్నాయ విద్యుత్‌ లైన్‌ వేస్తున్నారు. ఏదైనా సబ్‌ స్టేషన్‌లో సమస్య ఉత్పన్నమైతే మరో సబ్‌స్టేషన్‌ నుంచి విద్యుత్‌ సరఫరా అందించేందుకు ఈప్రత్యామ్నాయ విద్యుత్‌ లైన్లు ఉపయోగపడనున్నాయి. ప్రతీ జిల్లాకు ప్రత్యేకంగా చీఫ్‌ ఇంజనీర్‌, జనరల్‌ మేనేజర్‌ స్థాయి అధికారులను నోడల్‌ ఆఫీసర్లుగా నియమించి వేసవిలో విద్యుత్‌ సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా నాణ్యమైన, మెరుగైన విద్యుత్‌ సరఫరా చేసేందుకు టీజీ ఎన్పీడీసీఎల్‌ యాజమాన్యం అన్ని చర్యలు తీసుకుంటోంది.

విద్యుత్‌ వినియోగం (మిలియన్‌ యూనిట్లలో)

జిల్లా	ఫిబ్రవరి 7న		8న		9న		10న		11న	
(సర్కిల్‌)	2024	2025	2024	2025	2024	2025	2024	2025	2024	2025
హనుమకొండ	4.85	5.08	4.73	5.08	4.86	4.97	4.94	4.91	4.80	4.93
వరంగల్‌	3.95	4.27	3.83	4.15	3.99	4.41	3.88	4.36	4.80	4.31
జనగామ	5.23	5.55	5.29	5.39	5.40	5.51	5.31	4.96	5.12	5.60
మహబూబాబాద్‌	3.72	4.22	3.85	4.13	3.80	4.26	3.82	4.20	3.68	4.04
భూపాలపల్లి	7.22	7.79	7.15	7.65	7.10	7.96	7.11	8.20	6.81	8.26

విద్యుత్‌ డిమాండ్‌ (మెగావాట్లలో)

జిల్లా	ఫిబ్రవరి 7న		8న		9న		10న		11న	
(సర్కిల్‌)	2024	2025	2024	2025	2024	2025	2024	2025	2024	2025
హనుమకొండ	283	329	281	317	305	308	301	323	292	327
వరంగల్‌	267	316	266	306	279	315	277	297	268	360
జనగామ	279	306	273	318	284	270	282	308	273	292
మహబూబాబాద్‌	322	389	331	383	346	388	344	389	317	360
భూపాలపల్లి	354	367	345	364	352	390	342	379	332	386

ఉమ్మడి జిల్లాలో విద్యుత్‌ సరఫరా డిమాండ్‌ (మెగావాట్లలో)

ఫిబ్రవరి	2024	2025
7	1,179	1,440
8	1,181	1,412
9	1,249	1,389
10	1,236	1,410
11	1,184	1,352

వీడిన హత్య కేసు మిస్టరీ

- రెండేళ్ల క్రితం ధర్మారం శివారులో లభ్యమైన వృద్ధురాలి మృతదేహం
- హత్యగా కేసు నమోదు.. కీలక ఆధారాలు లభ్యం
- పోలీసుల ఎదుట లొంగిపోయిన నిందితుడు.. కారు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ రవీందర్‌

పరకాల: రెండేళ్ల క్రితం నడికూడ మండలం ధర్మారం శివారులో జరిగిన వృద్ధురాలి హత్య కేసు మిస్టరీ వీడింది. వృద్ధురాలి కన్నకొడుకు సన్నిహితుడే హత్యకు పాల్పడినట్లు పోలీసుల విచారణలో తేలగా.. నిందితుడు పరకాల పోలీసుల ముందు లొంగిపోగా.. బుధవారం అరెస్ట్‌ చేశారు. హత్యకు సంబంధించిన వివరాలను వరంగల్‌ ఈస్ట్‌జోన్‌ డీసీపీ పి.రవీందర్‌ పరకాల ఏసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. శాయంపేట మండలం ఆరెపల్లి గ్రామానికి చెందిన వాడికాల బొందమ్మకు నలుగురు సంతానం. ఒక కొడుకు, ముగ్గురు కూతుళ్లు. తనకున్న 10 గుంటల భూమిని కొడుకుకు కాదని.. కూతుర్లకు ఇస్తానని గ్రామంలో జరిగిన పంచాయితీలో చెప్పడమే ఆమెకు శాపమైంది. కొడుకుకు ఇవ్వాలని అదే గ్రామానికి చెందిన ఇంటి రాజిరెడ్డి వృద్ధురాలితో వాదించాడు. ఆవిషయాన్ని మనసులో పెట్టుకున్న వృద్ధురాలు పంచాయితీ జరిగిన మరుసటి రోజు 2023 మార్చి26న రాజిరెడ్డి ఇంటికి వెళ్లి తమ కుటుంబంలో చిచ్చు పెడుతున్నావంటూ శాపనార్థాలు పెడుతూ దూషించింది. దీంతో ఆగ్రహించిన రాజిరెడ్డి ఇంటి చుట్టు పక్కల ఎవరూ లేకపోవడంతో వృద్ధురాలిని చితకబాది హత్య చేశాడు. అంతటితో ఊరుకోకుండా మృతదేహంపై ఉన్న బంగారు గాజులు, మెడలోని బంగారు గొలుసు, కమ్మలు దోచుకొని ఎడ్ల కొట్టంలో దాచిపెట్టాడు. తర్వాత మృతదేహాన్ని తన కారులో వేములవాడ వైపు తీసుకెళ్లి.. మళ్లీ అదే రాత్రి హుజూరాబాద్‌, నడికూడ మీదుగా ధర్మారం శివారులోని కెనాల్‌ కల్వర్టు వద్ద పడేసి వెళ్లిపోయాడు. గ్రామస్తులు అందించిన సమాచారంతో ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు హత్యగా కేసు నమోదు చేశారు. వరంగల్‌ సీపీ అంబర్‌ కిషోర్‌ ఝా ఆదేశాల మేరకు వృద్ధురాలి హత్య కేసును సీరియస్‌గా తీసుకొని విచారణ జరపగా ఆమె సొంత గ్రామానికి చెందిన ఇంటి రాజిరెడ్డే హత్య చేసినట్లు పోలీసులకు కీలక ఆధారాలు లభ్యమయ్యాయి. నిందితుడి కోసం గాలిస్తుండగా పరకాల పోలీసుల ముందు మరొకరి సాయంతో లొంగిపోయాడు. వృద్ధురాలి నుంచి దోచుకున్న బంగారాన్ని వరంగల్‌లోని ఓ జ్యువెల్లరీలో కరిగించి కడెం చేయించుకున్నాడు. కొద్ది రోజులకు తన అవసరాల కోసం ఓ ఫైనాన్స్‌లో తాకట్టుపెట్టినట్లు పోలీసుల విచారణలో తేలినట్లు డీసీపీ రవీందర్‌ వెల్లడించారు. నిందితుడి నుంచి కారును స్వాధీనం చేసుకుని అరెస్ట్‌ చేసినట్లు తెలిపారు. హత్య కేసును ఛేదించిన పరకాల, శాయంపేట సీఐలు క్రాంతికుమార్‌, రంజిత్‌రావు పోలీసు బృందాన్ని డీసీపీ రవీందర్‌, ఏసీపీ సతీశ్‌బాబు అభినందించారు.

హత్యాయత్నం కేసులో ఇద్దరికి జైలు

లింగాలఘణపురం: మండలంలోని కుందారం సమీపంలో 2019లో దేవరుప్పుల మండలం రామచంద్రగూడేనికి చెందిన కైరిక ఆంజనేయులుపై హత్యాయత్నం జరిగింది. ఈఘటనకు కారకులైన అదే గ్రామానికి చెందిన కైరిక భాస్కర్‌, నాగన్నకు మూడేళ్ల జైలు శిక్షతో పాటు రూ.5వేలు జరిమానా విధిస్తూ అసిస్టెంట్‌ సెషన్‌ జడ్జి సుచరిత బుధవారం తీర్పు చెప్పినట్లు ఎస్సై శ్రావణ్‌కుమార్‌ తెలిపారు. ఆంజనేయులు, భాస్కర్‌, నాగన్న మధ్య చిట్టీ డబ్బుల విషయంలో గొడవలున్నాయి. ఈనేపథ్యంలో ఆంజనేయులును చంపాలని పథకం ప్రకారం బైక్‌పై వెళ్తున్న అతడిని భాస్కర్‌, నాగన్న కుందారం సమీపంలో సుమోతో ఢీకొట్టారు. తలకు తీవ్ర గాయాలైన ఆంజనేయులు ప్రాణాలతో బయటపడ్డాడు. ఈఘటనకు సంబంధించి ఆంజనేయులు బంధువులు చిక్కుడు భాస్కర్‌ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. అప్పటి ఎస్సై ఎస్‌.రవీందర్‌ కేసు నమోదు చేశారు. కోర్టు కానిస్టేబుల్‌ నరేశ్‌ నిందితులకు శిక్షపడేలా సాక్ష్యాలను ప్రవేశపెట్టినట్లు ఎస్సై శ్రావణ్‌కుమార్‌ తెలిపారు.

పగిడిద్దరాజు ఆలయంలో ప్రత్యేక పూజలు



ముస్తాబైన పగిడిద్దరాజు ఆలయం

గంగారం: మేడారం మినీ జాతర ప్రారంభం కావడంతో మహబూబాబాద్‌ జిల్లా గంగారం మండలంలోని పూనుగొండ్ల గ్రామంలోని పగిడిద్దరాజు ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధానార్చకులు, మహిళలు ఉపవాసం ఉండి ఆలయాన్ని శుద్ధి చేశారు. ఆలయాన్ని అందంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మినీ జాతరకు పూజారులు, వడ్డెలు బయల్దేరి వెళ్లారు.

సమ్మక్కకు చెలపేయ మొక్కులు



సమ్మక్క పూజారులకు చెలపేయను అప్పగిస్తున్న చెర్ప వంశస్తులు

ఎస్‌ఎస్‌ తాడ్వాయి: మండలంలోని ఊరట్టం గ్రామానికి దివంగత మాజీ చెర్ప భోజారావు ఆనవాయితీని కొనసాగిస్తూ ఆయన కుటుంబీకులు మండమెలిగె పండుగ రోజున సమ్మక్క పూజారులకు చెలపేయను అప్పగించారు. పూజారులు గద్దెల చుట్టూ చెలపేయతో ప్రదక్షిణలు నిర్వహించారు. ఊరట్టం ఆశ్రమ పాఠశాల విద్యార్థుల ఆదివాసీ సంప్రదాయ నృత్యాలు అలరించాయి. కాగా.. చెర్ప భోజారావు కుమార్తెలు, అల్లుళ్లు మాజీ ఎంపీపీ గొంది వాణిశ్రీ–సత్యనారాయణ, గొంది జయశ్రీ – కీ.శే వీరయ్య, కాక అరుణ–మాధవరావుతో పాటు ఆ గ్రామానికి చెందిన చెర్ప వంశీయులు ఈమొక్కు కార్యక్రమంలో భాగస్వాములయ్యారు.

తప్పిపోయిన తండ్రి కోసం వెతుకులాట



ములుగు: సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం జనగామ గ్రామానికి చెందిన జంగిడి వెంకటయ్య 2024లో జరిగిన మేడారం మహా జాతరలో తప్పిపోయాడు. కుమారుడు రాము తోడుగా వచ్చిన బంధువులు, గ్రామస్తులు ఎంత వెతికినా ఆచూకీ దొరకలేదు. తండ్రి ఫొటోతో ఫ్లెక్సీ తయారు చేయించి ఈసారి జరుగుతున్న మినీ మేడారం జాతరలో రాము వెతకడం ప్రారంభించాడు. జంపన్న వాగు, ఐటీడీఏ క్యాంపు కార్యాలయం, అమ్మవారి ప్రవేశ మార్గం ఎదుట భక్తులకు ఫ్లెక్సీ చూపిస్తూ తన తండ్రి కనిపిస్తే ఆచూకీ తెలపాలని వేడుకుంటూ కనిపించాడు. వివరాలు తెలిస్తే 79954 54146 నంబర్‌లో సంప్రదించాలని ఆయన కోరుతున్నాడు.



జంపన్నవాగులో షవర్ల వద్ద స్నానాలచరిస్తున్న భక్తజనం



జాతరలో భక్తుల కోలాహలం

మనసారా మొక్కులు







పసుపు, కుంకుమతో సమ్మక్క గుడికి వెళ్తున్న పూజారులు, సమ్మక్క గుడిలోపల శక్తి పీఠాన్ని అలికి ముగ్గులు వేసిన ఆడపడుచులు

ఘనంగా మండమెలిగె పండుగ

- అమ్మవార్లకు ప్రత్యేక పూజలు
- మేడారంలో జన సందడి
- తరలివచ్చిన వేలాది మంది భక్తులు



సారలమ్మ గద్దె వద్ద మొక్కులు చెల్లిస్తున్న భక్తులు

ఎస్‌ఎస్‌ తాడ్వాయి: మేడారం, కన్నెపల్లిలో బుధవారం మండమెలిగె పండుగ ఆదివాసీ సంస్కృతీ సంప్రదాయం ప్రకారం వైభవంగా జరిగింది. సమ్మక్క సారలమ్మల పూజారులు అమ్మవార్ల ఆలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. బుధవారం ఉదయం ఆలయాలను శుద్ధి చేసిన పూజారులు మండమెలిగె పూజా కార్యక్రమాలను ప్రారంభించారు. మేడారంలోని సమ్మక్క గుడిలో అమ్మవారి శక్తి పీఠాన్ని అలికి సిద్ధంగా ఉంచగా, సమ్మక్క పూజారి సిద్ధబోయిన మునీందర్‌ ఇంటి నుంచి ఆడపడుచులు, పూజారులు డోలు వాయిద్యాల నడుమ పసుపు, కుంకుమలను తీసుకొని గుడికి చేరుకున్నారు. అమ్మవారి శక్తి పీఠాన్ని, గుమ్మాలను పసుపు, కుంకుమలతో అందంగా అలంకరించారు. అనంతరం సమ్మక్క పూజారి సిద్ధబోయిన నితిన్‌ ఇంటి నుంచి పవిత్ర జలం, పసుపు, కుంకుమలను తీసుకొని పోచమ్మగుడికి వెళ్లి చీర సమర్పించి పూజలు చేశారు. నితిన్‌ ఇంటి వద్ద తయారు చేసిన మామిడి తోరణాలను చిలుకలగుట్టకు వెళ్లే దారిలో రోడ్డుకిరువైపులా కర్రలకు కోడి పిల్ల, సొరకాయ, మిరపకాయ (దిష్టి తగలకుండా)ను కట్టి ధ్వజస్తంభాన్ని నిలిపారు. ధ్వజస్తంభం వద్ద దూప వడ్డె నాగేశ్వర్‌రావు, సమ్మక్క పూజారులు కొక్కెర కృష్ణయ్య, సిద్ధబోయిన నితిన్‌, సిద్ధబోయిన స్వామి, మల్లెల సత్యం నీళ్లారగించారు. ఈశాన్యం దిక్కున పొలిమేరలో ధ్వజస్తంభానికి కూడా మామిడి తోరణాలు కట్టి పూజలు చేశారు. బుధవారం రాత్రి సమ్మక్క పూజారులు పసుపు, కుంకుమ పూజా సామగ్రి తీసుకొని డోలు వాయిద్యాలతో సమ్మక్క గద్దెకు 11:23 గంటలకు చేరుకున్నారు. వీరికి రాష్ట్ర మంత్రి సీతక్క ఆడపడుచులతో కలిసి సమ్మక్క పూజారులకు ఎదురెళ్లి నీళ్లారగించారు. రాత్రి అమ్మవారి గద్దె వద్ద పూజారులు రహస్య పూజలు నిర్వహిస్తున్న సమయంలో ఆలయంలో విద్యుద్దీపాలను ఆర్పేశారు.

కన్నెపల్లిలో సారలమ్మకు పూజలు

కన్నెపల్లిలోని సారలమ్మ గుడిలో పూజారులు మండమెలిగె పండుగను ఘనంగా నిర్వహించారు. ఉదయాన్నే గుడిని శుద్ధి చేసి పసుపు, కుంకుమ, బంతిపూలతో అలంకరించారు. సారలమ్మ వడేరాల కుండలను అలంకరించారు. సారలమ్మ ప్రధాన పూజారి కాక సారయ్య అమ్మవారి పూజాసామగ్రిని శుద్ధి చేసి అలంకరణ అనంతరం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. రాత్రి సమయంలో సారలమ్మ పూజారులతో పాటు గ్రామంలోని ఆదివాసీలంతా కలిసి గుడి నుంచి పసుపు, కుంకుమ, శాకహానం (ఇప్పపువ్వు సారా) తీసుకొని రాత్రి 11.07 గంటలకు గద్దెలకు చేరుకున్నారు. గద్దెల వద్ద రహస్య పూజలు నిర్వహించారు. అనంతరం సమ్మక్క సారలమ్మ పూజారులు కలిసి డోలు వాయిద్యాలతో గద్దెల వద్ద సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్ధబోయిన జగ్గారావు, పూజారులు సిద్ధబోయిన మునీందర్‌, భోజారావు, సిద్ధబోయిన స్వామి, అరుణ్‌, వసంతరావు, సారలమ్మ పూజారులు కాక కిరణ్‌, మేడారం జాతర చైర్మన్‌ ఆరెం లచ్చు పటేల్‌ పాల్గొన్నారు.

భక్తుల సందడి

మినీ మేడారం (మండమెలిగె) సందర్భంగా అమ్మవార్లను దర్శించుకునేందుకు వేలాదిగా భక్తులు తరలివచ్చారు. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు ఛత్తీస్‌గఢ్‌, మహారాష్ట్ర నుంచి ప్రైవేట్‌ వాహనాల్లో వేలాదిగా తరలివచ్చారు. జంపన్నవాగు వద్ద షవర్ల కింద స్నానాలు ఆచరించారు. భక్తుల తాకిడి పెరిగినప్పటికీ క్యూలైన్‌ ద్వారా గద్దెల పైకి అనుమతించడంతో భక్తులు అమ్మవార్లను తనివితీరా దర్శించుకున్నారు. డీఎస్పీ రవీందర్‌ పర్యవేక్షణలో పస్రా సీఐ రవీందర్‌, తాడ్వాయి ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి, పోలీస్‌ సిబ్బంది భారీ బందోబస్తు నిర్వహించారు. ఎక్కడ కూడా ట్రాఫిక్‌ జామ్‌ జరగకుండా వాహనాలను పార్కింగ్‌ స్థలాల్లోకి మళ్లించారు. మొక్కుల అనంతరం భక్తులు మేడారంలోని చిలకలగుట్ట, ఆర్టీసీ బస్టాండ్‌, శివరాంసాగర్‌, జంపన్నవాగు, తదితర ప్రాంతాల్లో విడిది చేసి సందడి చేశారు. మినీ జాతర సందర్భంగా భక్తల తాకిడితో మరోసారి వనమంతా సందడి కనిపించింది.



తలనీలాలు సమర్పిస్తున్న భక్తులు



ముగ్గులు వేస్తున్న ఆడపడుచులు



సమ్మక్క పూజారులకు నీళ్లు ఆరబోసేందుకు ఆడపడుచులతో కలిసి ఉన్న మంత్రి సీతక్క



బంగారం తీసుకొస్తున్న భక్తులు



బంతి భోజనం చేస్తున్న కుటుంబసభ్యులు